క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: వినాయకనగర్ సబ్‌స్టేషన్ 11కేవీ సంతోషిమానగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల వలన బుధవారం ఉదయం 11 నుంచి 1 గంట వరకు నలంద స్కూల్ ఏరియా, గంగపుత్ర సంఘం, డీఏవీ స్కూల్ ఏరియా, సంతోషి మానగర్ కాలనీ, వినాయకనగర్ బ్లాక్ 3, డీమార్ట్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదు. ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ పూలపల్లి బాలయ్య బాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల వలన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓల్డ్ సఫిల్‌గూడ, పీబీ కాలనీ, సుధానగర్, బృందావన్ కాలనీ, ఎన్‌బీహెచ్ కాలనీ, సింహాద్రినగర్, చంద్రగిరి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బి.శ్రీనివాసులు తెలిపారు.

మౌలాలి: పీబీ కాలనీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓల్డ్ సఫిల్‌గూడ, పీబీ కాలనీ, బృందావన్ కాలనీ, సుధానగర్, ఎన్‌బీహెచ్ కాలనీ, చంద్రపురి కాలనీల్లో విద్యుత్ ఉండదని, అదేవిధంగా సంతోషిమానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నలంద హైస్కూల్, డీఏవీ పబ్లిక్ స్కూల్, గంగపుత్ర సంఘం, సంతోషిమానగర్, డీమార్ట్ వెనుక, వినాయక్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

శ్రీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక



సంక్షేమ సంఘానికి ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

రామంతాపూర్: శ్రీనగర్‌కాలనీ సంక్షేమ సంఘానికి మంగళవారం రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా దండు సంతోష్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన సలహాదారు సందీప్ మాట్లాడుతూ మిగతా కార్యవర్గ సభ్యుల్ని త్వరలోనే ఎన్నుకుంటామన్నారు. శ్రీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించేందుకు కొత్తగా ఎన్నుకోబడిన సంఘం కృషి చేస్తుందని తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్ ఈదమ్మ దేవాలయం వద్ద సీసీ రోడు పనులను ఈదమ్మ కమిటీ సభ్యులతో కలిసి కాప్రా డీఈ రూప, ఏఈ స్రవంతి పరిశీలించారు. దేవాలయం కమిటీ ప్రతినిధులు ఎస్వీ కిట్టు, బాలరాజ్‌గౌడ్, సురేష్, విజయ్‌గౌడ్, రమేష్ నాయక్, బాబురావు, సతీష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక చేయూత



పేద విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: కళాశాల ఫీజు చెల్లించలేని ఓ విద్యార్థినికి బీఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆర్థిక చేయూనందించారు. సెయింట్ జాన్స్ పీజీ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు చెందిన ప్రవళ్లిక తల్లిదండ్రులకు ఆయన మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. పేదరికంతో ఉన్నత చదువులకు దూరమవుతున్న పేదలకు తాను అండగా నిలుస్తానన్నారు. కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి, దూసరి నవీన్‌గౌడ్, నరేందర్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ తరగతులు

అల్వాల్: అల్వాల్ వీబీఆర్ గార్డెన్‌లో ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు బోగ విష్ణుమూర్తి తెలిపారు. సాధారణ వ్యాయామం, సూర్య నమస్కారాలు, యోగాసనాలు నేర్పుతున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్, థైరాయిడ్, మానసిక ప్రశాంతత, సాధారణ వ్యాధులు రాకుండా, వచ్చిన వారికి నియంత్రణ అవుతాయని తెలిపారు. నిత్య సాధన చేసేవారికి ఇవి క్రమం తప్పకుండా చేయాలన్నారు. ఆసక్తిగలవారు శిక్షణ తరగతులలో చేరాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



అల్వాల్: వెంకటాపురం భూదేవినగర్‌లోని సమారిటన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో షాలెం ప్రార్థనా మందిరంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 175 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి మల్లారెడ్డి

మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో రూ.2.10 కోట్లతో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ డివిజన్ హేమానగర్‌లో రూ.20 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రూ.29.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే 8వ డివిజన్ ద్వారకానగర్‌లో రూ.22 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, 19వ డివిజన్‌లో రూ.50 లక్షలతో బీటీ రోడ్డు, ఈస్ట్ బృందావన్ కాలనీలో రూ.22 లక్షలతో సీసీ రోడ్డు, 12వ డివిజన్ అంబేద్కర్‌నగర్ ఫేస్–2లో రూ.18 లక్షలతో సీసీ రోడ్డు పనులు, 14వ డివిజన్ ఆర్‌ఎన్‌ఎస్ రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, 28వ డివిజన్ సాయి ఎన్‌క్లేవ్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, కార్పొరేటర్లు కొత్త శ్రీవిద్య చక్రపాణిగౌడ్, సీసీ వెంకటేశ్‌గౌడ్, చీరాల నర్సింహ, సామల పవన్‌రెడ్డి, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌ఎన్‌ఎస్ కాలనీలో మంత్రికి నిరసన సెగ

బోడుప్పల్ ఆర్‌ఎన్‌ఎస్ కాలనీలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన మంత్రి చామకూర మల్లారెడ్డికి నిరసన సెగ తగిలింది. కాలనీ మహిళలు, బీజేపీ నాయకులు మంత్రిని కలిసి వక్ఫ్ బోర్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. మంత్రి అందుకు సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపుతామన్నారు. ఇంతలో బీజేపీ నాయకులు, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకునే ప్రయత్నంలో ఉండగా పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ఇంతలో మంత్రి మల్లారెడ్డి జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్‌ఎన్‌ఎస్ కాలనీవాసులు, బీజేపీ నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మాకు రాజకీయాలు వద్దని, మా సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు



ఉప్పల్ నల్ల చెరువు వద్ద బేబి పాండ్‌ను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తదితరులు



అల్వాల్ కొత్త చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీ శ్రీనివాస్‌రెడ్డి

ఉప్పల్: వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాచకొండ పరిధిలోని అన్ని కొలనులు, ముఖ్యమైన చెరువుల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. వినాయక ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేవిధంగా సోమవారం కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఉప్పల్ నల్లచెరువు వద్ద ఏర్పాటు చేసిన బేబి పాండ్‌ను ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వసతి, విద్యుత్ దీపాలు, అత్యవసర సమయాల్లో మెడికల్ సిబ్బంది, పోలీసు బందోబస్తు అన్ని రకాల వసతులను జీహెచ్‌ఎంసీ సిబ్బంది కల్పించడం అభినందనీయం అన్నారు. రాచకొండ సీపీ చౌహాన్‌తో పాటు భాగ్యనగర్, ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు ఉన్నారు.

కొత్త చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన

అల్వాల్: అల్వాల్‌లోని కొత్త చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యావేక్షించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాల ప్రభావం వల్ల ఏదైనా ఇబ్బందులు పడితే దానికోసం వాటర్‌ప్రూఫ్ టెంట్లు, పెద్ద క్రేన్లు, లైట్లతో పాటు అవసరమయ్యే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచామన్నారు. ఈఈ రాజు, ఏఈ లక్ష్మి, విజయరామరావు, శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రభాకర్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



శివనగర్ కాలనీ వాసులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని జొన్నబండ, శివనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో పార్కు మధ్యలో ఉన్న బండరాయిని తొలగించాలని ఎమ్మెల్యేను కాలనీవాసులు కోరగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన సొంతంగా రూ.2 లక్షల చెక్కును కాలనీవాసులకు అందజేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వర్షపు నీరు నిలిచిపోయే చోట బాక్స్ డ్రెయిన్ ప్రతిపాదనను కూడా సిద్ధం చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఏఆర్‌కే హోమ్స్‌ను సందర్శించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, డీసీ మహేష్, చారి, అనిల్, నరేష్‌రెడ్డి, రమేష్, సుజయ్, ఎంజీఆర్ ప్రభాకర్, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, రాజుయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, విష్ణు, దేవా, శోభన్, ఆనంద్, కొండయ్య, సత్యనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

వినాయక పూజలో మల్లారెడ్డి



శ్రీసాయి ఎన్‌క్లేవ్‌లో వినాయక పూజలో మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: శ్రీసాయి ఎన్‌క్లేవ్ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన వినాయక పూజలో మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ సామల బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చీరాల నర్సింహ పాల్గొనగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు. సరస్వతి నగర్ కాలనీలోని ఎంకే టవర్స్‌లో నిర్వహించిన వినాయక పూజలో అపార్టుమెంట్ అధ్యక్షులు రఘుపతిరెడ్డి, కార్యదర్శి సదానందం, మహిళలు పాల్గొన్నారు.

తొమ్మిదో రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ఉప్పల్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారానికి 9వ రోజుకు చేరుకుంది. ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న అంగన్‌వాడీల సమ్మెకు సీఐటీయూ నాయకులు జె.వెంకన్న మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల కనీస వేతనం రూ.26వేలు, ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షల వరకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వసంత, నాగమణి, హరిప్రియ, ప్రేమలత, లలిత పాల్గొన్నారు.



ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

ట్రాక్ డే విజయవంతం

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటి దాకా బైకర్స్‌కు మాత్రమే పరిమితమైన రైడ్స్ ఇప్పుడు స్కూటరిస్టులకు కూడా విస్తరించాయి. ఇటాలియన్ పియాజియో గ్రూప్ ఆధ్వర్యంలో స్కూటర్ రైడర్స్ కోసం నగరంలో తొలిసారిగా నెక్లెస్ రోడ్‌లోని క్విట్ స్టాప్‌లో నిర్వహించిన ట్రాక్ డే విజయవంతం అయ్యిందని పియాజియో వెహికల్స్ ప్రతినిధులు తెలిపారు. ఈ ఈవెంట్‌లో వందలాదిగా వెస్పా, అప్రిలియా తదితర వాహనాల రైడర్లు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బండారి లక్ష్మారెడ్డి, గొల్లూరి అంజయ్య

కుషాయిగూడ: బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కుషాయిగూడ బస్టాండ్ వద్ద ప్రతి మంగళవారం అంబేడ్కర్‌కు పూలమాల వేసే కార్యక్రమం 300 రోజులకు చేరిన సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, డిపో మేనేజర్ చంద్రకాంత్, డిపో ప్రెసిడెంట్ వంగూరి హరీష్, డిపో సెక్రటరీ గౌడ కిరణ్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ గద్దం శ్రీనివాస్, రాజయ్యనాయక్, పల్లె రవికుమార్ యాదవ్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు అండ



హబ్సిగూడలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు మంగళవారం హబ్సిగూడలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి చేతులమీదుగా చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, శివ, వినీష్‌రెడ్డి, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'మా స్థలాలను ఆక్రమించేశారు'



- ఎమ్మెల్యే మైనంపల్లి, అతడి అనుచరులు బెదిరిస్తున్నారు
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బాధితుల ఆవేదన

పంజగుట్ట: తాము బతికిన మాదిరి తమ పిల్లలు అద్దె ఇంట్లో ఉండకూడదని పైసాపైసా కూడబెట్టి స్థలం కొనుగోలు చేస్తే మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, అతడి అనుచరులు ఆక్రమించుకున్నారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం బీజేవైఎం జాతీయ కోశాధికారి పీఎం.సాయిప్రసాద్, మల్కాజిగిరి జిల్లా, ఓల్డ్ అల్వాల్, జొన్నబండలోని విఘ్నేశ్వరా హౌసింగ్ సొసైటీ, మౌలాలి, ఆర్‌టీసీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ బాధితులు లావణ్య, శ్రీరాం, కల్పన, ఉమ మాట్లాడుతూ.. విఘ్నేశ్వర హౌసింగ్ సొసైటీలో 12 ఎకరాల 21 గుంటల స్థలంలో 1980లో 142 మంది ప్లాట్స్ కొనుగోలు చేశారని, అందరికీ పక్కా రిజిస్ట్రేషన్‌తో చట్టప్రకారం భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. 1996లో సదరు స్థలంపై మైనంపల్లి హన్మంతరావు అతడి అనుచరుల కన్ను ఈ స్థలంపై పడిందని, అప్పటి నుంచి నకిలీ పేపర్లు సృష్టిస్తూ, స్థలంలో ఎవరూ ఇల్లు కట్టుకోకుండా, గుండాలను పెట్టేవాడన్నారు. ఇక ఎమ్మెల్యే అయ్యాక స్థలం మొత్తం కబ్జా చేసుకుని ఇప్పటికే 30 శాతం ఇండ్లు, అపార్ట్‌మెంట్లు కట్టేశాడని, మిగిలిన స్థలంలోకి కూడా యజమానులైన తమను లోనికి రానివ్వకుండా బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లినా తమకు న్యాయం జరగకుండా చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మౌలాలి ఆర్‌టీసీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీల్లో కూడా సుమారు 100 మంది 2000 సంవత్సరంలో ప్లాట్లు కొనుగోలు చేశామని, అక్కడ కూడా మైనంపల్లి, అతడి అనుచరులు కబ్జా చేసుకున్నారని మా స్థలంలోకి వెళ్తే అక్రమ కేసులు బనాయించి స్టేషన్‌లో ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు కార్చే ప్రతి కన్నీటిబొట్టుకు వడ్డీతో సహా బదులు తీసుకుంటామని బీజేవైఎం నాయకుడు సాయి హెచ్చరించారు. మైనంపల్లిని, అతడి అనుచరులను తప్పకుండా చర్లపల్లికి పంపించే వరకు ఊరుకునేది లేదని, అతను కబ్జా చేసిన ప్రతి స్థలాన్ని బుల్డోజర్‌తో కూల్చేస్తామని హెచ్చరించారు.

జన్మదిన వేడుకలు



చీమ శ్రీనివాస్ జన్మదిన వేడుకలో సూపరింటెండెంట్

మల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఈఎస్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కమల మట్లాడారు. 15 ఏళ్లుగా ఈఎస్‌ఐ అసోసియేషన్ అధ్యక్షులుగా ఉంటూ వైద్యుల కోసం, కార్మికుల కోసం, ఈఎస్‌ఐ పరిరక్షణ కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు వెంకటేష్ బాబు, నాగేందర్, రమేష్, సతీష్, ఆర్‌ఎంవో రజ్వంత్, వెంకట్‌రెడ్డి దుర్గా పద్మజ, జగదీష్, రవి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ అనంత సరస్వతీనగర్ కాలనీలో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యూజీడీ, తాగునీటి పైపులైన్లు పూర్తయిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.



పది సెల్‌ఫోన్లు అందజేసిన పోలీసులు

కుషాయిగూడ: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 10 మంది బాధితులకు మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ సెల్‌ఫోన్లు అందజేశారు. కొత్తగా వచ్చిన సీఈఐఆర్ సాఫ్ట్‌వేర్ సాయంతోనే సెల్‌ఫోన్లను సులువుగా గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు లభ్యం కావడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేసి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమానికి గ్యారెంటీ కాంగ్రెస్

మల్కాజిగిరి: తెలంగాణలో ప్రజాసంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ ఇస్తోందని తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే కేఎస్ అలగిరి, తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి అన్నారు. కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల కార్డుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అప్రజాస్వామిక ప్రభుత్వం, కుటుంబ పాలన కొనసాగుతోందన్నారు. బంగారు తెలంగాణ ఏర్పాటు కోసమే సోనియా గాంధీ రాష్ట్రాన్ని ప్రకటిస్తే ఉద్యమకారుల ఊపిరితో పీఠమెక్కిన కేసీఆర్ విస్మరించి నియంత పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రజలు రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడాలన్నారు. ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చిన కర్నాటకలో హామీలను అమలు చేసిందని, తెలంగాణలో కూడా ఆరు గ్యారెంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. పార్టీ నాయకులు విస్తృతంగా పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో గ్యారెంటీ కార్డుల పంపిణీ

అభివృద్ధి చేసి చూపిస్తాం..

ఉప్పల్: ఉప్పల్ ఎ– బ్లాక్ అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌ను టీపీసీసీ ప్రతినిధులు మేకల శివారెడ్డి, కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మాటల్లో కాదు చేతల్లో చూపిస్తామని హామీ ఇచ్చారు. సోనియగాంధీ ప్రకటించిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతి మహిళకు రూ.2,500, అర్హులైన వారికి ఉచిత విద్యుత్, పింఛన్ల పెంపు తదితర పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బోరంపేట కృష్ణ, ఈగ అంజయ్య, తౌఫిక్, లింగంపల్లి రామకృష్ణ, అమరేశ్వరీ, లూకాస్, కొంపల్లి బాలరాజు, బాకారం లక్ష్మణ్, విజయ్‌కుమార్, మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్ గడప గడపకూ కాంగ్రెస్ డిక్లరేషన్‌ను ప్రచారం చేస్తున్న నేతలు

పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

హబ్సిగూడ: డివిజన్ పరిధిలోని పలు సమస్యలపై కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ మంగళవారం అధికారులతో కలిసి పర్యటించారు. సాయిచిత్రనగర్‌లో, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో డ్రైనేజీ సమస్యపై ఆమె అధికారులతో కలిసి చర్చించారు. అదేవిధంగా రామ్‌రెడ్డినగర్ డ్రైనేజీ ట్రంక్ లైన్ పైపులైన్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రిజిస్ట్రార్ రిటైర్డ్ కార్నెల్ సంజయ్ కపూర్, జలమండలి సీజీఎం నాగేందర్, జీఎం సంతోష్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, ఏఈ ఆసీఫ్ అలీ, రవీందర్, బీజేపీ నాయకులు సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ప్రభుదాస్ జన్మదిన వేడుకలు

హబ్సిగూడ: కాప్రా సర్కిల్ మీర్‌పేట–హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ జన్మదిన వేడుకలు హబ్సిగూడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ప్రభుదాస్‌ను సత్కరించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బద్దం భాస్కర్‌రెడ్డి, భాస్కర్ ముదిరాజ్, రఘుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, నవీన్‌గౌడ్, సుశీల్, చంద్రశేఖర్, వసీర్‌అలీ, నరేందర్, తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా హబ్సిగూడ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు బండబాల వినీష్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు.



హబ్సిగూడలో కార్పొరేటర్ ప్రభుదాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఆక్రమణలను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కాప్రా: సాక్షిలో ప్రచురితమైన రోడ్డెక్కిన ఎల్లారెడ్డిగూడవాసులు అనే కథనానికి కాప్రా సర్కిల్ అధికారులు స్పందించారు. మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రోడ్డు ఆక్రమించి నిర్మించిన కట్టడాలను షెడ్‌లను తొలగించారు. దీంతో వాహనదారులు, పాదచారులు సంతోషం వ్యక్తం చేశారు. ఆక్రమణలు తొలగించేలా కథనాన్ని ప్రచురించిన సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్లారెడ్డిగూడలో ఆక్రమణలు తొలగించిన కాప్రా మున్సిపల్ సిబ్బంది

గంజాయి మత్తులో కత్తులతో దాడి

మేడిపల్లి: గంజాయి మత్తులో కొందరు యువకులు కత్తులతో దాడికి పాల్పడటంతో పలువురికి గాయాలైన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం నారపల్లి ఎంఎస్ ఆర్ నగర్ కాలనీలో ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ఉన్న యువకులపై సుమారు 10–12 మంది గుర్తు తెలియని యువకులు కత్తులతో వచ్చి దాడికి పాల్పడ్డారు. సదరు యువకుల్లోని ఒకరు యువతికి అసభ్యపదజాలంతో వాట్సాప్ మెసేజ్‌లను పంపుతున్నాడంటూ దాడికి పాల్పడినట్లు తెలిపారు. గంజాయి తాగిన మత్తులో కత్తులతో దాడికి పాల్పడటంతో పలువురు యువకులకు గాయాలయ్యాయి. ఆ యువకులు మేడిపల్లి పోలీసులను ఆశ్రయించారు.